క్లుప్తంగా

డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటుకు అనుమతులు.. హర్షణీయం

చిలుకూరు : చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో డీసీసీబీ నూతన బ్రాంచ్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతులు ఇవ్వడం హర్షణీయమని డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్ అన్నారు. శనివారం చిలుకూరు ప్రాథమిక సహకార సంఘంలో డైరెక్టర్లు, రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చిలుకూరులో డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డైరెక్టర్లు, రైతులు, సీఈఓ, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి సహకారం అభినందనీయం



బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్, పూర్వ విద్యార్థి చరణ్‌ప్రసాద్

అనంతగిరి : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి సహకారం అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాస్ అన్నారు. అనంతగిరి మండల పరిధిలోని మొగలాయికోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చిక్కుల చరణ్‌ప్రసాద్ శనివారం రూ.30వేల విలువగల స్కూల్ బ్యాగ్‌లు, స్టేషనరీ, ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు వీరబ్రహ్మచారి, నరసింహారావు, రంగమ్మ, శ్రావణి, ఉమాదేవి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులో సాగర్ ఎడమకాలువ ప్రధాన లాకుల వద్ద గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో గల అన్నదాన సత్రంలో అయ్యప్ప మాలధారులకు ప్రతి యేటా నిర్వహించే అన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈనెల 18నుంచి నవంబర్ 27వరకు 41రోజుల పాటు అయ్యప్ప మాలధారులకు నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్ గురుస్వామి తెలిపారు. గత 12 ఏళ్లుగా అయ్యప్ప మాలధారులకు దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 200 మంది మాలధారులు, ఆలయ పూజారి నరమనేని రామారావు, కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్ గురుస్వామి, కుందూరు పుల్లారెడ్డి, అన్నెం శ్రీను గురుస్వామి పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించేవరకూ పోరాటం

- కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో బీసీ బంద్ ప్రశాంతం
- ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించిన అఖిలపక్ష, వివిధ సంఘాల నాయకులు



కోదాడ : రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు



మఠంపల్లి : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీసీ జేఏసీ, అఖిల పక్ష నాయకులు

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకూ అన్ని రాజకీయ పక్షాల మద్దతుతో పోరాటం కొనసాగిస్తామని బీసీ జేఏసీ కన్వీనర్ ధూళిపాల శ్రీనివాస్ అన్నారు. శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతుతో పట్టణంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, దుకాణాలు, వ్యాపార వాణిజ్య, విద్యా సంస్థలను మూసివేయించారు. అడ్డరోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. సీఐ చరమందరాజు, ఎస్‌ఐ మోహన్ బాబులు బంద్‌ను పర్యవేక్షించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ, టీడీపీ, వివిధ కుల, ప్రజా, కార్మిక, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదాడలో బంద్ పాక్షికం.. ప్రశాంతం

కోదాడ : బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం నిర్వహించిన రాష్ట్ర బంద్ కోదాడలో పాక్షికంగా, ప్రశాంతంగా జరిగింది. తెల్లవారుజామునే వామపక్షాల నాయకులు కోదాడ ఆర్టీసీ డిపో వద్ద బైఠాయించి బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో బస్సుల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. విద్యాసంస్థలకు ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. వ్యాపార సంస్థలు ఉదయం 11 గంటల తరువాత తెరుచుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ, వామపక్ష నాయకులు, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, గిరిజన, మైనార్టీ విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి రంగా థియేటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి రంగా థియేటర్ సెంటర్‌లో ధర్నా చేశారు. కోదాడ పట్టణ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు వంగవేటి రామారావు, పారా సీతయ్య, చింతలపాటి శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, పిల్లుట్ల శ్రీనివాస్, పెండెం వెంకటేశ్వర్లు మేకల శ్రీనివాసరావు, బత్తినేని హనుమంతరావు, ముల్కలపల్లి రాములు ముత్యాలు, చింతాబాబు, ఏపూరి రాజు, నూనె సులోచన, నరసింహారావు, ఉదయగిరి, ఎస్.కె.నయీం. సంగిశెట్టి గోపాల్, కస్తూరి రాములు, పిట్టల బాగ్యమ్మ, దొంగరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో బంద్ విజయవంతం

చిలుకూరు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ శనివారం చేపట్టిన బంద్ చిలుకూరులో విజయవంతమైంది. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై అఖిల పక్ష నాయకులు ధర్నా చేశారు. కాంగ్రెస్ నాయకులు మరోసారి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ పార్టీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ మునగాలలో విజయవంతమైంది. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీసీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో అఖిలపక్ష నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఉప్పుల జానకిరెడ్డి, ఎలక నరేందర్‌రెడ్డి, గంధం సైదులు, చింతకాయల నాగరాజు, అమరబోయిన మట్టయ్యయాదవ్, మాతంగి బసవయ్య, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, పసుపులేటి రమేష్, గన్నా నరసింహారావు, జిల్లేపల్లి శ్రీనివాస్, ఎండీ.రషీద్ , తక్కెళ్లపాటి సాయి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, దేవరం వెంకటరెడ్డి, చిల్లంచర్ల ప్రభాకర్, ధారావత్ రవి, వల్లూజు వసంత్ కుమార్, ఉప్పుల మట్టారెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బీసీ జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన బంద్ నేరేడుచర్లలో శనివారం విజయవంతమైంది. బంద్‌కు బీసీ హక్కుల సాధన సమితి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్, జనసేన పార్టీ, సీపీఐఎంఎల్ (మాస్‌లైన్)తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నేత ధనుంజయనాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఇంజమూరి వెంకటయ్య, జనసేన నేత సరికొప్పుల నాగేశ్వర్‌రావు, నాయకులు చిలకరాజు శ్రీను, వెంకట్, శ్రీనివాస్ గౌడ్, అరుణ్, నగేష్, జ్యోతిబాబు, సురేష్‌రెడ్డి, నర్సింహారావు, పుల్లారావు తదితరులు ఉన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : మండల కేంద్రంలో శనివారం అఖిల పక్ష నాయకులు చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, సీపీఐ మండల కార్యదర్శి బద్దారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జనిగ సైదులు, ఆదినారాయణ, శంకర్, కొండలు, అంజి, సైదులు, నారాయణ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో జేఏసీ, అఖిల పక్ష పార్టీలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, సీపీఎం, సీపీఐ పార్టీల మండల కార్యదర్శులు బాలునాయక్, పున్నయ్య, జేఏసీ నాయకులు కంటు లక్ష్మయ్య, జాల కిరణ్, బీవీ రామారావు, ప్రకాష్‌బాబు, బుచ్చయ్య, కర్నె వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, జోసు, రాములు, నాయకులు ఖరీమ్, శ్రీను, మహాలక్ష్మి, సోములు, గురువయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మోతె : పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు



నేరేడుచర్ల : మాట్లాడుతున్న చిన వెంకట్‌రెడ్డి

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండలంలో శనివారం బీసీ బంద్ విజయవంతమైంది. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు ఇతర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. దుకాణాలను మూసి వేయించారు. ప్రభుత్వ కార్యాలయంలో పనులు చేయవద్దంటూ కోరారు. మండలంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి కల్మలచెరువు రోడ్డు వరకు బీసీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ, టీడీపీ, వివిధ రాజకీయ పార్టీల అనుబంధ సంఘాల నాయకులు, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, త్రిపురం అంజన్‌రెడ్డి, కటకం రమేష్, పెండెం ముత్యాలుగౌడ్, సందీప్, కీత రామారావు, వీటీ, షేక్ యాకూబ్, కీసర నాగయ్య, చాంద్‌మియా, కృష్ణ, ఓరుగంటి చిరంజీవి, నాగరాజు, కాశయ్య, నాగయ్య, సోమయ్య, సైదులు, రాములయ్య, శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గుండు నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల సమన్వయ కర్త అనంతుల ఆంజనేయులు, వివిధ పార్టీల నాయకులు గుండు శ్రీనివాస్, ఎండీ.జలీల్ అహ్మద్, దున్నా శ్రీనివాస్, వేపూరి సుధీర్‌కుమార్, నూనె నాగన్న, అనంతుల మహేష్ గౌడ్, బాణాల నాగరాజు, దేవరంగుల వీరన్న, దాసరి శ్రీనివాస్, బోనగిరి ఉపేందర్, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

మోతె : బీసీలకు విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం మోతె మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చేపట్టిన బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సీపీఎం, కాంగ్రెస్ పార్టీ, బీసీ నాయకులు మండల కేంద్రంలోని ఖమ్మం- సూర్యాపేట జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బొడ్డు సాలయ్య, కాటమరాజు, బొడ్డు నర్సయ్య, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర నాయకులు బాషపంగు సునిల్, గుగులోతు సురేష్, పజ్జూరి నాగరాజు, మండవ రాము, విప్లవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడులో..

పాలకవీడు : బీసీలకు స్థానిక సంస్థల ఎనికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకూ పోరాడతామని బీసీ సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకులు అన్నారు. బీసీ బంద్‌లో భాగంగా శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పాలకవీడు : ధర్నాలో పాల్గొన్న నాయకులు



నడిగూడెం : రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు



గరిడేపల్లి : ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు



చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలను బంద్ చేస్తున్న అఖిలపక్ష నాయకులు



మేళ్లచెరువు : బంద్‌లో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు



మునగాల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

భవిత కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించాలి



ఎమ్మార్సీ కార్యాలయంలో స్థలం పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సుమారు రూ.10 లక్షలతో చేపట్టబోయే భవిత కేంద్రం భవన నిర్మాణానికి స్థలాన్ని శనివారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. తక్షణమే భవిత కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంఈఓ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

గేదె దూడకు శస్త్రచికిత్స



దూడకు శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడరూరల్ : మలద్వారం లేకుండా పుట్టిన గేదె దూడకు శస్త్రచికిత్స చేసి మలద్వారం ఏర్పాటు చేసి దాని ప్రాణాలు కాపాడారు కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య. వివరాలలోకి వెళితే మండల పరిధిలోని నెమలిపురి కాలనీకి చెందిన వనపర్తి తిరుమలచారి గేదెకు మూడు రోజుల కిందట మలద్వారం లేకుండా దూడ పుట్టింది. దీంతో దూడ కడుపులోని మలం బయటకు రాకుండా ఇబ్బంది పడుతుండటంతో శనివారం రైతు కోదాడ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. దూడను పరీక్షించిన డాక్టర్ పెంటయ్య జన్యుపరమైన లోపలతో కొన్నిసార్లు పశువులు ఈవిధంగా దూడలకు జన్మనిస్తాయని, శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. యజమాని ఒప్పుకోవడంతో దూడకు శస్త్రచికిత్స ద్వారా మలద్వారం ఏర్పాటు చేసి కడుపులో ఉన్న మలాన్ని బయటకు తీసి దూడ ప్రాణాలు కాపాడారు. జన్యులోపంతో ఇలాంటి దూడలు పుడుతుంటాయని చికిత్స అందిస్తే బతుకుతాయని తెలిపారు. చికిత్సలో సిబ్బంది ఉన్నారు.

కుందేలు కాలుకు చికిత్స

కోదాడ పట్టణానికి చెందిన ఏలూరి మహేశ్వరి పెంచుకుంటున్న మూడు నెలల వయస్సున్న కుందేలు పిల్లకు ప్రమాదంలో కాలు విరిగింది. ఆ కుందేలును ఆమె కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగ పరీక్షించిన డాక్టర్ పెంటయ్య లేత కాలికి కట్టువేస్తే తట్టుకోలేదని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కలను తెప్పించి విరిగిన ఎముకలను కలుపుతూ సిమెంటు కట్టు వేసి కాలిని అతికించి చికిత్సచేశారు. చికిత్సలో అనంతగిరి పశువైద్యాధికారి డాక్టర్ సిరిపురపు సురేందర్, సిబ్బంది చంద్రకళ ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై 'బస్తీ బాట'



వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏఈ పందిరి శ్రీనివాస్

పాలకవీడు : విద్యుత్ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో మండల విద్యుత్ అధికారి పందిరి శ్రీనివాస్.. సిబ్బందితో కలిసి పర్యటించి విద్యుత్ వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రం శివారు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండడం, రాత్రి వేళలో వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలను గుర్తించారు. లో- వోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. లైన్ ఇన్‌స్పెక్టర్ గుంటి పిచ్చయ్య, లైన్‌మెన్ పడిమర్తి వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



చిలుకూరు : బేతవోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, చైర్మన్

నడిగూడెం : ధాన్యం కొనుగోలు కొంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని, రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్ కోరారు. శనివారం కాగితరామచంద్రాపురం, కరివిరాల గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోలి మల్సూర్, సీఈఓ శ్రీనివాస్, ఆర్‌ఐ గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, ఏఈఓలు ఉప్పయ్య, రేణుక, మౌనిక, నాగిరెడ్డి లింగారెడ్డి, రణబోతు విశ్వనాథరెడ్డి, గుండు శ్రీనివాస్, దున్నా శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మోతె : మండల పరిధిలోని సిరికొండ, నామవరం గ్రామాల్లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, పీఏసీఎస్ సిరికొండ మాజీ చైర్మన్ కొండపల్లి వెంకటరెడ్డి ప్రారంభించారు. సిరికొండ పీఏసీఎస్ సీఈఓ అనంతరెడ్డి, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సొసైటీ మాజీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మునగాల మండలంలో..

మునగాల : రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ కోరారు. శనివారం మండలంలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద, నేలమర్రిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం కరుణాకర్, ఏపీఓ శైలజ, మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు, వ్యవసాయ శాఖ ఏఈఓలు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని బేతవోలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ ధృవకుమార్.. సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ పాషా, ఆర్‌ఐ మంత్రిప్రగడ సీత రామచందర్‌రావు, కార్యదర్శులు సత్యనారాయణ, పూల శ్రీను, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రామాపురంలో ఇటీవల విద్యుదాఘాతంతో శ్రీరాముల వెంకటేశ్వర్లు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. దీంతో శనివారం బాధిత కుటుంబానికి బేతెస్థ ఫౌండేషన్ చైర్మన్ దుర్గం కరుణశ్రీ ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రాపోలు నవీన్, మాతంగి పీటర్, బుడిగే నాగరాజు, ధర్మయ్య, తక్కెళ్ల నాగార్జున ఉన్నారు.


గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

మేళ్లచెరువు : పశుపోషకులు గాలికుంటు నివారణ టీకాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం చింతలపాలెం, యర్రకుంటతండా, కొత్తగూడెం తండాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధుల నివారణకు చికిత్స అందించారు. డాక్టర్ మధు నాయక్, శేఖర్, వెంకన్న, అఖిల్, షమీర్, శ్రీనాథ్, క్రాంతి పాల్గొన్నారు.

మళ్లీ సిండికేట్ దందా !

నిబంధనలు అతిక్రమిస్తున్న టపాసుల దుకాణాదారులు

- అధిక ధరలకు విక్రయం
- చందాలు ఇవ్వాలని షాపుల నిర్వాహకులకు బెదిరింపులు
- తలాకొంత ముట్టజెపుతూ దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు



కోదాడ : కోదాడ పట్టణంలో దీపావళిని పురస్కరించుకొని ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల వ్యవహారం ప్రతి ఏడాది చర్చనీయాంశంగా మారుతోంది. ఈ వ్యాపారంలో ఉన్న లొసుగులను కొందరు తమకు అనుకూలంగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని నిబంధనలు పాటిస్తూ టపాసుల దుకాణాలను ఏర్పాటు చేయడం కష్టం కావడంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అందరి చేతులు తడపడం పరిపాటిగా మారింది. గత పది సంవత్సరాలుగా కోదాడ పట్టణంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బహిరంగ ప్రదేశంలో సుమారు 20 నుంచి 25 దుకాణాలను ఏర్పాటు చేసేవారు. ఈ వ్యాపారానికి సిండికేట్ కింగ్‌గా వ్యవహరించే ఓ వ్యక్తి ప్రతి దుకాణం నుంచి రూ. 50 వేల నుంచి రూ. 60 వేల చొప్పున రూ.15 లక్షల వరకు వసూలు చేసి ఆ మొత్తాన్ని ఈ వ్యాపారంతో సంబంధం ఉన్న ఫైర్, మున్సిపాలిటీ, పోలీస్, రెవెన్యూతో పాటు మీడియా, వివిధ సంఘాల వారికి తలా కొంత పంచడంతో పాటు కొన్ని దీపావళి టపాసులను ఉచితంగా ఇచ్చేవారు. రెండు సంవత్సరాలుగా దీపావళి పండుగ సమయంలో వర్షాలు రావడంతో వ్యాపారం సక్రమంగా జరగలేదు. దీనికి తోడు వ్యాపారులను చందాలు అడిగేవారు ఎక్కువ కావడంతో దీన్ని తప్పించుకోవడానికి ఈ సంవత్సరం టపాసుల వ్యాపారులు తాత్కాలిక అనుమతులు కాకుండా 365 రోజుల పాటు టపాసులు విక్రయించడానికి అనుమతులు తీసుకొని దాదాపు 10 దుకాణాలను కోదాడ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసుకున్నారు.

మేము 35 మందిమి.. మా సంగతేంటి..!

వ్యాపారులు 365 రోజులకు అనుమతులు తీసుకున్నప్పటికీ పేలుడు పదార్థాల విక్రయ చట్టం ప్రకారం అన్ని నిబంధనలు పాటించడం లేదని, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సాకును చూపుతూ కొందరు ఈ వ్యాపారులపై తమదైన శైలిలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వ్యాపారులు మరోసారి సిండికేట్‌గా ఏర్పడ్డారు. తలాకొంత ముట్టజెపుతూ తమ దందా కొనసాగిస్తున్నారు. ఇది తెలుసుకున్న ఓ యూనియన్‌కు అధ్యక్షుడినని చెప్పుకునే ఒకరు రెండు రోజుల క్రితం తాము 35 మందిమి ఉన్నామని.. ఒక లిస్ట్‌ను సదరు వ్యాపారులకు ఇచ్చి తమను సక్రమంగా చూసుకోకపోతే మీ సంగతి చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డట్లు సమాచారం. తమకు ఒక్కొక్కరికి రూ.3 వేలతో పాటు ఉచితంగా దీపావళి మందులను ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వ్యాపారులు బేరసారాలకు దిగినట్లు తెలిసింది. ఇది తెలుసుకున్న మరో నాయకుడు సదరు వ్యాపారుల వద్దకు వెళ్లి తమకు వారితో సంబంధం లేదని తాము 20 మంది వరకు ఉన్నామని తమను కూడా చూసుకోవాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఇదే అదనుగా సిండికేట్‌గా మారిన వ్యాపారులు టపాసుల ధరలను పెంచి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

దీపావళి టపాసుల వ్యాపారం చేసే వారు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. లేకపోతే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. వ్యాపారులను చందాల కోసం బెదిరించే వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. బెదిరింపులకు పాల్పడేవారిపై ఫిర్యాదు చేస్తే విచారించి అవసరమైతే వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం.

– కె.శివశంకర్, కోదాడ పట్టణ సీఐ

సురేష్‌బాబు ఆశయ సాధనకు కృషిచేయాలి



సురేష్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం చిలుకూరులో దొడ్డా సురేష్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వ్యక్తిగతంగా సురేష్‌బాబు మంచి వ్యక్తి అని, పార్టీలకు అతీతంగా అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి సురేష్ అని అన్నారు. మొదటి నుంచి కమ్యూనిస్టు కుటుంబమైన దొడ్డా సురేష్ బాబు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, నాయకులు కంబాల శ్రీను, గుండు వెంకటేశ్వర్లు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డా వెంకటయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డా సురేష్‌బాబు.. ఆదర్శప్రాయుడు



సురేష్‌బాబు సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : మాజీ ఎంపీపీ, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు ఆదర్శప్రాయుడని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం చిలుకూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డా సురేష్‌బాబు సంతాప సభలో ఆయన మాట్లాడారు. సురేష్‌బాబు మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే, వివిధ పార్టీల నాయకులు సురేష్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకీరామాచారి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, గ్రామస్తులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.